క్లుప్తంగా

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

గుడివాడ టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేయడాన్ని సీఎం చంద్రబాబునాయుడు విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మెండా కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యాన్ని పేదలకు అందజేయాలనే సంకల్పంతో జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని టీడీపీ నాయకులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఈ ఆలోచనను విరమించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ మచిలీపట్నంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అభిమానులు, దళిత సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎంపీపీ పెయ్యల ఆదాము, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, మైనార్టీ సెల్ నాయకులు బాబుల్, జవహరుద్దీన్, నాయకులు సీహెచ్ జోషి, కారె జోసఫ్, సువర్ణరాజు, కె. రవి, చిన్నా, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సందడి

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో శనివారం సాంస్కృతిక సందడి ఏర్పడింది. మచిలీపట్నం విజయసాయి సంగీత నిలయం వారిచే భక్తి రంజని పాటలు, గుడివాడ నటరాజ నాట్య కళాశాల వారి కూచిపూడి నృత్య ప్రదర్శనలు, శ్రీ కొండలమ్మ నాట్య మండలి వారిచే శ్రీ సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఆహుతులను అలరించాయి. అనంతరం కళాకారులను దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు సన్మానించారు.

అనధికార ఫ్లెక్సీలు తొలగించండి

గుడివాడ టౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలు, బోర్డులు, పోస్టర్లను తొలగించాలని భవిష్యత్ భద్రతాదళం సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కాపాడాలంటూ ఉప ముఖ్యమంత్రి ప్రకటనలు చేయడం, వారి అభిమానులు అనధికారికంగా భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంపై చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వలన పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఫ్లెక్సీలు తొలగింపునకు సంబంధించి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు పట్టించుకోపోవడం సరికాదన్నారు. భవిష్యత్ భద్రతా దళం సభ్యులు ఎండీ తెహర్ బాషా, జి. పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

గుడివాడ టౌన్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారం ముగిసిందని ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్ర తెలిపారు. ప్రముఖ నెట్‌వర్క్ కంపెనీ ఎడ్వాక్ నెట్‌వర్క్ టెక్ ఆధ్వర్యంలో సైన్స్, కామర్స్ విద్యార్థులకు వర్క్ షాప్ జరిగిందని పేర్కొన్నారు. సైన్స్ విద్యార్థులకు డెఓప్స్, కామర్స్ విద్యార్థులకు ఆల్ ఇన్ ఫైనాన్స్ అనే అంశాలపై ఈ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వర్క్ షాప్ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎడ్వాక్ ప్రతినిధి ఎస్. శ్రీవెంకటేష్, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.

కైకలూరు ఎంపీడీఓగా రాజబాబు

కైకలూరు: కైకలూరు ఎంపీడీఓగా రెబ్బ రాజబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా గన్నవరం కార్యాలయ ఏఓగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కైకలూరు వచ్చారు. అదేవిధంగా ఉంగుటూరు మండలం ఆత్కూరు పంచాయతీ ఈఓగా పనిచేస్తున్న ఘంటా అప్పారావు ఉద్యోగోన్నతిపై కైకలూరు డెప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. వీరిద్దరినీ పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

ఆటోమోటివ్ ట్రేడ్‌పై విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు గుడ్లవల్లేరు శ్రీ లక్ష్మీ మోటార్స్‌లో ఆ సంస్థ అధినేత సీహెచ్.ఉపేంద్ర ఆటోమోటివ్ ట్రేడ్‌పై ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. సమగ్ర శిక్షా కార్యక్రమం కింద తమ 10వ తరగతి విద్యార్థుల కోసం ఆటోమోటివ్ ట్రేడ్‌పై హెచ్‌ఎం ఆదేశాలతో 10 రోజుల ఇంటర్న్‌షిప్ నిర్వహించనున్నట్లు జీసీడీఓ ఒకేషనల్ ట్రైనర్ శ్రీనివాసరరావు తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులు ఆటోమొబైల్ రంగానికి చెందిన ప్రాథమిక సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకుంటున్నారని పేర్కొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి పంచాయతీ పరిధిలో మొవ్వ వైద్యాధికారి సూచనల మేరకు దోమల నివారణకు టెక్నికల్ మలాథియాన్‌ను శనివారం గ్రామంలో ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త కె.రామాంజనేయులు, మూడో వార్డు మెంబర్ కాకర్ల శ్రీనివాసరావు, కుమార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో శనివారం అమ్మవార్లను లలితా త్రిపురసుందరీదేవి, రాజ్యలక్ష్మిదేవి, సంతానలక్ష్మిగా అలంకరించారు. పలు చోట్ల సామూహిక కుంకుమ పూజలు, చండీ హోమాలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు.


పామర్రులో లలితా త్రిపుర సుందరీదేవిగా అంకమ్మ తల్లి


దేవపూడిలో సంతానలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు


గుడివాడ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా..


ఆటపాకలో లలితా త్రిపుర సుందరీ మాత అలంకరణలో దుర్గమ్మ

ఐశ్వర్య ప్రదాయినీ.. లలితా త్రిపుర సుందరి

పామర్రు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. పూజలను హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు వరదా అప్పారావు, కోటి పాండురంగారావు తెలిపారు. కాత్యాయనీ దేవిగా కన్యకా పరమేశ్వరీ దేవిని అలంకరించి పూజలు చేశారు. బుచ్చమ్మ ఆశ్రమంలోని పర్వతవర్ధనీ దేవికి లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ తల్లితో పాటు అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో అమ్మవారు శనివారం శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. కౌతవరం శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగాను, డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు శ్రీ విజయలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు.

ప్రత్యేక పూజలు

గుడివాడరూరల్: మండలంలోని చిన ఎరుకపాడు గ్రామంలోని శ్రీఅష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారు, కోతిబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు శనివారం శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.


పెదపూడిలో నిర్వహించిన లక్ష కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

గుడివాడలో రాజరాజేశ్వరీదేవిగా..

గుడివాడ టౌన్ : దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక వాసవిచౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానం(చిన్నశివాలయం) లో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం, నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రీ వైష్ణవీదేవిగా, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సంతానలక్ష్మీదేవిగా, బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ కాత్యాయినీ దేవిగా అమ్మవారిని అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.

అమ్మవారికి లక్ష కుంకుమ పూజ

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడిలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరామహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి లక్ష కుంకుమ పూజ నిర్వహించారు. శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించిన కనకదుర్గమ్మకు పెద్ద ఎత్తున సువాసినులు పూజలు చేశారు. పురోహితులు జంధ్యాల పాండురంగ శర్మ ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి.

సంతానలక్ష్మిగా అమ్మవారు

ముదినేపల్లి రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో అమ్మవారు శనివారం సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకుడు దాసరి భగవాన్ దాసు ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు. మహిళా భక్తులు అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొండలమ్మకు భక్త నీరాజనాలు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ అమ్మవారికి సహస్ర నామార్చన, సమస్త ఐశ్వర్యాలకు శ్రీ లలితా శ్రీ సూక్త హవనం చేశారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకటవిష్ణు మోహన్‌రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు పాల్గొన్నారు. అలాగే డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ఊంజల్ సేవను నిర్వహించారు.


కొండలమ్మ ఆలయంలో హోమం చేస్తున్న ఈఓ కొండలరావు, చైర్మన్ మోహన్, రామరాజు దంపతులు

గౌరీశంకర దేవస్థానంలో హోమం

గుడివాడ టౌన్ : స్థానిక శ్రీ గౌరీశంకర స్వామి దేవస్థానంలో శనివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ కె.గోపాలరావు తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు దంపతులు, సీహెచ్ జగన్మోహనరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడివాడ పరిసర ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఈ హోమం నిర్వహించినట్లు ఈఓ తెలిపారు.


చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా దసరా ఉత్సవాలు

కైకలూరు: దేవీ శరన్నవరాత్రులు కైకలూరు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. కైకలూరు శ్యామలాంబ తల్లి, లోకుమూడిగురువు దత్తాశ్రమంలో అమ్మవారు, ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో కనకదుర్గమ్మ తల్లి లలితా త్రిపుర సందరీదేవీగా భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. శ్యామలాంబ ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఆధ్వర్యంలో చండీ మహాయాగం జరిగింది. కోలాట ప్రదర్శన, హరికథాగానం, నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మ రాజరాజేశ్వరీ మాతగా నీరాజనాలు అందుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో దసరా వేడుకల్లో అమ్మవారికి చామంతి పూజ, లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దత్తాశ్రమంలో గురజాడ ఉదయశంకర్, మురళీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కలిదిండి మండలం పడమటిపాలెం గంగానమ్మ గుడి వద్ద అమ్మవారి లలితాదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు.


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అమ్మవారి మాల ధరించిన భక్తులు

ఐక్యతతో అరాచకాలను తిప్పికొడదాం

కైకలూరు: ఐక్యతతో ప్రజల సమస్యలపై పోరాడి కూటమి పాలనలో అరాచకాలను తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పిలుపునిచ్చారు. ఇటీవల మండవల్లి మండల పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులు కైకలూరు పార్టీ కార్యాలయంలో డీఎన్నార్‌ను శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. డీఎన్నార్‌ను కలసిన వారిలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, రైతు విభాగ అధ్యక్షుడు బుర్ల భోగేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేతల నాగరాజు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయేల్, క్రిస్టియన్ మైనారిటీ విభాగ అధ్యక్షుడు జంగం రామదాసు, పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు వీర వెంకట సత్యనారాయణ, వలంటీర్స్ విభాగ అధ్యక్షురాలు కె. రమ్య, చేనేత విభాగ అధ్యక్షురాలు దుర్గా, వైఎస్సార్‌టీఫ్ విభాగ అధ్యక్షుడు వినోద్, అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలు స్వప్నలతా, సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు చోరీ పేతురు, సోషల్ మీడియా విభాగ అధ్యక్షుడు శివరామకృష్ణ, వికలాంగుల విభాగ అధ్యక్షుడు కాగిత నాగబాబు, ప్రచార విభాగ అధ్యక్షుడు నాంచారయ్య ఉన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగ కార్యదర్శి గుమ్మడి వెంకటేశ్వరరావు, మండవల్లి మండల పార్టీ అధ్యక్షుడు బేతపూడి ఏసుబురాజు, నాయకులు పాల్గొన్నారు.


మండవల్లి మండల విభాగాల అధ్యక్షులను అభినందించిన డీఎన్నార్

జాగృతి పథకంతో పేదలకు ఎంతగానో ఉపయోగం

పెదపారుపూడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా సంస్థ ప్రవేశపెట్టిన జాగృతి అనే పథకం ద్వారా ఉచిత సలహాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని గుడివాడ మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, 11వ జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జాగృతి పథకం ద్వారా పేదలకు అందుతున్న ఉచిత సలహాలు, సాయంపై జడ్జి ఆరా తీశారు. రెవెన్యూ సేవలు ప్రజలకు సకాలంలో అందుతున్నాయా లేదా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యాలయం డీటీ కె.ఏసుపాదం, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం

సంక్షిప్త వార్తలు

నిధుల దుర్వినియోగంపై 8న విచారణ

కైకలూరు: కైకలూరు మేజర్ పంచాయతీని వివాదాలు వదలడం లేదు. సర్పంచ్ చెక్ పవర్ రద్దు తర్వాత రూ.24,71,000 పంచాయతీ నుంచి ఖర్చు చేసిన వాటిలో అవకతవకలు జరిగాయని రాచపట్నంకు చెందిన చెక్క మురళీ అనే వ్యక్తి ఈ ఏడాది జూలై 9న ఏలూరు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాల్సి ఉంది. దసరా పండగ రోజుల్లో అధికారులు ఉత్సవాల విధుల్లో ఉండటంతో విచారణను అక్టోబరు 8కి వాయిదా వేశారు.

బిల్ కలెక్టర్ మృతికి సంతాపం

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న మూడే శ్రీనివాసరావు రెండు రోజుల కితం మృతి చెందాడు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు , ఎంపీడీఓ విమాదేవి శనివారం శ్రీనివాసరావు మృతికి సంతాపకంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ శ్రీనివాసరావుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పీ4 విధానాన్ని విజయవంతం చేయాలి

పెదపారుపూడి: సచివాలయం ఉద్యోగులు పీ4 విధానాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీ4పై సచివాలయాల ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జీర్ణోద్ధరణకు గురైన ఆలయాలపై దృష్టి

పెదముద్దాలి(పామర్రు): జీర్ణోద్ధరణకు గురైన ఆలయాలపై దృష్టి సారించి, వాటి అభివృద్ధికి కృషి చేస్తామని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి(సుజనా చౌదరి) పేర్కొన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలోని శ్రీ ఉద్దండ వేణుగోపాల స్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు ఉద్దండ వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరిందని, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే సందించి మాట్లాడారు. దేవస్థానం పునర్నిర్మాణంపై దేవదాయ శాఖ అధికారులు , దేవదాయ శాఖ మంత్రితో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. దేవాలయ పునర్నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని తెలిపారు. అనంతరం ఆలయాల్లో సత్యనారాయణ చౌదరికి ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ఏఎన్నార్ కళాశాల స్నాతకోత్సవం

గుడివాడ టౌన్ : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్స్‌లర్ పి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏఎన్నార్ కళాశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఇక్కడ విద్యార్థులు దేశ విదేశాల్లో సేవలందిస్తున్నారన్నారు. యువత సాంకేతికతను వినియోగించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

నేతలారా.. తగునా ఇది!

ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. స్థానిక నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలోని కాలక్షేప మండపంలో పాలక వర్గం ఏర్పాట్లను భక్తులు తప్పు పడుతున్నారు. అక్కడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పాలకవర్గం అధ్యక్షుడు ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో నేతల ఫొటోలు పెద్దవిగా ముద్రించి అమ్మవారి విగ్రహం చిన్నదిగా పెట్టడం కారణంగా వీరి కాళ్లమధ్య అమ్మవారు ఉన్నట్లుగా కనిపిస్తోంది. ప్రత్యేకించి వీరు ధరించిన చెప్పులు, బూట్లు అమ్మవారికి నమస్కరించే సమయంలో వారి పాదాలకు నమస్కరించినట్లుగా అర్థం వస్తుందని భక్తులు వాపోతున్నారు.

– గుడివాడటౌన్



జాతి వైరం!

అంతిమ విజయం ముంగీసదే..

పాము, ముంగీస అంటే జాతి వైరానికి తార్కాణం. మండలంలోని మామిడికోళ్ల ప్రధాన రహదారిలో శనివారం పాము, ముంగీస చెలగాటం చూపరులను నివ్వెరపరచింది. ఈ రెండింటి పోరాటంలో చివరకు ఎప్పటి మాదిరిగానే ముంగీసకు పాము చిక్కి ఓటమి పాలైంది. ఈ మార్గంలో వెళ్లే వారు వాటి పోరాటాన్ని చూస్తూ కొద్దిసేపు నిలిచిపోయారు.

– గుడ్లవల్లేరు



సమస్యలను పరిష్కరించాలని సీఎంకు వినతి

పామర్రు: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శనివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో డొంక రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణం చేయాలన్నారు. నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న వంతెనల నిర్మాణాలకు నిధులను కేటాయించాలన్నారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

డాగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

కైకలూరు: భద్రతా తనిఖీల దృష్ట్యా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కైకలూరు బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, శ్యామలాంబ దేవాలయ ప్రాంగణం, పలు లాడ్జీలు, సినిమా థియేటర్లలో పోలీసు జాగిలంతో తనిఖీ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మల్లాయపాలెం సమీపంలో ఉన్న టిడ్కో సముదాయం వద్ద శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

దేవస్థానాల జీర్ణోద్ధరణకు విరాళాల వెల్లువ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల పునర్నిర్మాణ పనులకు శనివారం దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌కు చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వర వరప్రసాద్, కృష్ణవేణి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. అలాగే యలమంచిలి నాగేశ్వరరావు, స్వర్ణసీత, నందకుమార్ రూ.10,116ను అందించారు. అలాగే పెదగొన్నూరుకు చెందిన బత్తుల నాగేశ్వరరావు స్మారకార్థం మాలతి రూ.10,116ను అందజేశారు. గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నెహ్రూ పశువుల సంత కమిటీ కార్యదర్శి ఈదుప్పగంటి ఉమా, సభ్యులు పాల్గొన్నారు.

రాజారావుకు నివాళి

ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకుడు గంట్యాడ లక్ష్మణ్ తండ్రి రాజారావుకు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం నివాళులర్పించారు. డీఎన్నార్ ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణతో కలిసి వెళ్లి రాజారావు భౌతికకాయాన్ని సందర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు జంపాన కోటయ్య, నాయకులు సింగంశెట్టి రాము, రాచూరి మోహన్, సాక్షి సాయి, రామాంజనేయులు, సత్యనారాయణ, రంగారావు, నాని, ఏసుకుమార్, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు డిజిటల్ బుక్ పోస్టల్ ఆవిష్కరణ

పామర్రు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తల కోసం రూపొందించిన 'డిజిటల్ బుక్' పోస్టల్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు పామర్రు పార్టీ కార్యాలయం వద్ద ఆవిష్కరించనున్నట్లు సిబ్బంది శనివారం తెలిపారు. అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, చినకోమర్రు గ్రామ కాపురస్తులు నూకారపు రమేష్ కుమార్ S/o. సూర్యనారాయణ అను నేను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. M9203409 ది. 22-08-2025వ తేదీన చినకోమర్రు నుండి ముదినేపల్లి బైకుమీదు ఫోటోస్టాట్ కోసం వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయడలరు.

నూకారపు రమేష్‌కుమార్, ఫోన్ : 95737 40893

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గుడివాడ డివిజన్

99516 02865 (గుడివాడ)

99516 02985 (కైకలూరు)

90105 77706 (పామర్రు)

Office mail : sakshiads@gmail.com